

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...



Contact Number
9059328777

విజయవాడ మంగళవారం 22-09-2026 సంపుటి: 02 సంచిక : 82 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని

Vijayawada Tuesday, 22-09-2026 Volume :02 Issue: 82 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani

## ఆఫ్గనిస్తాన్‌పై పాకిస్తాన్ వైమానిక దాడులు

### ముగ్గురు పౌరులు మృతి.. నలుగురికి గాయాలు

- కునార్, పక్తికా ప్రాంతాల్లో బాంబుల వర్షం
- కునార్‌లో ఓ ఇంటిపై దాడి.. ముగ్గురు మృతి
- పక్తికాలో ఇల్లు, దుకాణం ధ్వంసం
- ఉగ్రవాదులే లక్ష్యమన్న పాకిస్తాన్
- 28 మంది ఉగ్రవాదులు హతమైనట్లు పాక్ ప్రకటన
- దాడులను ఖండించిన తాలిబన్లు
- తగిన విధంగా స్పందిస్తామని హెచ్చరిక
- సరిహద్దు ఘర్షణలపై ఐక్యరాజ్యసమితి ఆందోళన
- ఏప్రిల్-జూన్‌లో 399 మంది పౌరులకు నష్టం

ఆఫ్గనిస్తాన్‌పై పాకిస్తాన్ వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున కునార్, పక్తిక ప్రావిన్సుల్లో పాక్ దాడులు చేసింది. కునార్‌లో జరిగిన దాడుల్లో ముగ్గురు సాధారణ పౌరులు మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు. పక్తికలోని బర్మాల్ జిల్లాలో రఖా, తోర్కండి ప్రాంతాలపై జరిగిన దాడుల్లో ఇల్లు, దుకాణం ధ్వంసమయ్యాయి. సరిహద్దుల్లో ఉగ్రవాద కార్యకలాపాల నేపథ్యంలోనే దాడులు చేస్తున్నట్లు పాకిస్తాన్ చెబుతోంది. అయితే, పౌర నివాసాలపై దాడులపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పాక్ దాడులను తాలిబన్లు తీవ్రంగా ఖండిస్తూ.. తమ భూభాగాన్ని రక్షించుకుంటామని స్పష్టం చేశారు.

02





02

## ఇటలీ స్కూళ్లలో బుర్ఖా నికాబ్‌పై నిషేధం

- విదేశీ విద్యార్థులకు కొత్త ప్రవేశ నిబంధనలు
- తల్లిదండ్రులు ఇటలీ భాష నేర్చుకోవడం తప్పనిసరి
- ఇటలీ సంస్కృతి, నిబంధనలను గౌరవించాల్సిందే
- స్కూళ్లు, కాలేజీల్లో విదేశీ విద్యార్థుల సంఖ్యకు పరిమితి
- ముఖం పూర్తిగా కప్పే బుర్ఖా, నికాబ్‌కే నిషేధం
- హిజాబ్‌పై ఎలాంటి ఆంక్షలు ప్రకటించని మెలోని
- పార్లమెంట్ ఆమోదం తర్వాత 60 రోజుల్లో అమలు
- వచ్చే ఏడాది ఎన్నికల వేళ మెలోని కీలక ప్రతిపాదనలు



## అల్పపీడనంపై అప్రమత్తం

- ఉత్తరాంధ్రలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు హోంమంత్రి అనిత ఆదేశాలు
- వంశధార, నాగావళి ప్రవాహాలపై ప్రత్యేక నిఘా
- వాగులు, కాజ్‌వేల వద్ద రాకపోకలపై ఆంక్షలు
- ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలి
- 24 గంటలూ కంట్రోల్ రూమ్‌లు అందుబాటులో ఉండాలి
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు
- అధికారిక సూచనలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి

అమరావతి,

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న రెండు రోజుల్లో తీవ్ర వాయుగుండంగా బలపడి దక్షిణ ఒడిశా ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఉన్నతస్థాయి అత్యవసర సమీక్ష నిర్వహించి అధికారులను అప్రమత్తం చేశారు. ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, ఇతర ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి.. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన ముందస్తు భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు. తీవ్ర వాయుగుండం ప్రభావంతో బుధ, గురువారాల్లో ఉత్తరాంధ్రలో

-మిగతా 2 లో

## స్వర్ణ కుప్పం దిశగా అడుగులు

### కుప్పాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- రూ.327 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- హంద్రీనీవా నీటితో 133 చెరువులకు జలకళ
- 550కిపైగా చెరువులను లిఫ్ట్ ఇరిగేషన్‌తో అనుసంధానం
- ప్రతి ఇంటికీ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు
- కుప్పాన్ని నెట్‌జీరో నియోజకవర్గంగా మారుస్తామని వెల్లడి
- పేదరికం లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ప్రకటన
- స్థానిక యువతకు పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- కుప్పంలో ఇప్పటికే 32 పరిశ్రమల ఏర్పాటు
- రూ.289 కోట్ల ప్రాజెక్టులకు భూమిపూజ
- కుప్పం కనెక్టివిటీకి పెద్దపీట.. రహదారులు, రైలు మార్గాల అభివృద్ధి
- భవిష్యత్తులో కుప్పంలో విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు
- స్వర్ణ కుప్పం దిశగా అడుగులు వేస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడి

కుప్పాన్ని మోడల్ నియోజకవర్గంగా, స్వర్ణ కుప్పంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. సోమవారం కుప్పంలో రూ.327 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ, శంకుస్థాపనలు చేశారు. హంద్రీనీవా నీటితో 133 చెరువులను నింపామని, 550కిపైగా చెరువులను లిఫ్ట్ ఇరిగేషన్‌తో అనుసంధానిస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటికీ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసి కుప్పాన్ని నెట్‌జీరో, పేదరికం లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు.
కుప్పంలో ఇప్పటికే 32 పరిశ్రమలు ఏర్పాటయ్యాయని, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. రూ.289 కోట్ల విలువైన ప్రాజెక్టులకు భూమిపూజ చేశామని చెప్పారు. రహదారులు, రైల్వే మార్గాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ భవిష్యత్తులో కుప్పంలో విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని సీఎం వెల్లడించారు.

02






02

## రష్యాలో ఎదురులేని పుతిన్..

- పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయం
- పుతిన్‌కు చెందిన యునైటెడ్ రష్యా పార్టీకి భారీ విజయం
- డ్యూమాలో 455 స్థానాలకు ఎన్నికలు.. 355 సీట్లు కైవసం
- యునైటెడ్ రష్యాకు 57.83 శాతం ఓట్లు
- 2021లో 49.8 శాతంగా ఉన్న ఓట్ల శాతం పెరుగుదల
- ఉక్రెయిన్ యుద్ధం తర్వాత జరిగిన తొలి పార్లమెంట్ ఎన్నికలు
- కమ్యూనిస్ట్ పార్టీకి 40 సీట్లు.. 13.8 శాతం ఓట్లు
- ఎల్‌డీపీఆర్‌కు 25 సీట్లు.. 8.99 శాతం ఓట్లు
- న్యూ పీపుల్ పార్టీకి 20 సీట్లు.. 7.96 శాతం ఓట్లు
- మద్దతుగా నిలిచిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన ఎల్లా పాంఫిలోవా

## ఢిల్లీలో దారుణం..



- ఆరో తరగతి బాలికను బంధించి అత్యాచారం చేసిన టైలర్
- దుకాణంలోకి పిలిచి అఘాయిత్యానికి పాల్పడిన టైలర్
- స్కూల్ వస్తువులు కొనేందుకు బయటకు వెళ్లిన బాలిక
- ఒంటరిగా ఉండటాన్ని గమనించి మాయమాటలతో వల
- ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులకు విషయం చెప్పిన బాలిక
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు
- నిందితుడు మక్సూద్‌ను అరెస్టు చేసిన పోలీసులు
- పోక్సో చట్టం కింద కేసు నమోదు
- వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలింపు

02

## జూరాల నీటిపై కేటీఆర్ ఫైర్

### నీరు ఉన్నా రైతులకు ఇవ్వడం లేదని ప్రభుత్వంపై విమర్శలు



జూరాల ప్రాజెక్టు వద్దకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతల అరెస్టు

- 248 టీఎంసీల కృష్ణా జలాల్లో తెలంగాణ వాడింది 28 టీఎంసీలే
- పాలమూరు రైతులకు రేవంత్‌రెడ్డి తొలి శత్రువుగా మారారని వ్యాఖ్య
- జూరాల కింద ఒక్క ఎకరం పంట ఎండినా ప్రభుత్వానిదే బాధ్యత
- కన్నేపల్లి, నార్లాపూర్ పంపులను వెంటనే ఆన్ చేయాలని డిమాండ్
- కర్ణాటకతో మాట్లాడి 10 టీఎంసీల నీరు తీసుకురావాలని సూచన
- రైతుల కోసం పెద్ద ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరిక
- ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధం చేస్తామని కేటీఆర్ ప్రకటన
- ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమని సవాల్
- సిరిసిల్లలో 8 వేల ఎకరాల భూముల కబ్జాపై సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్
- తప్పుడు ఆరోపణలు చేస్తే రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్

హైదరాబాద్

జూరాల ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. జూరాల ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు యత్నించిన బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో

-మిగతా 2 లో



02

## అంతరిక్ష రంగంలో చైనా దూకుడు..

- 45 గంటల్లో నాలుగు రాకెట్ ప్రయోగాలు!
- మూడు వేర్వేరు ప్రయోగ కేంద్రాల నుంచి వరుస ప్రయోగాలు
- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు చెందిన రాకెట్లతో ప్రయోగాలు
- నాలుగు రాకెట్ల ద్వారా కక్ష్యలోకి 30 ఉపగ్రహాలు
- క్వియాన్‌ఫాన్ నెట్‌వర్క్ కోసం 19 ఉపగ్రహాల ప్రయోగం
- మరో భారీ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ కోసం 9 ఉపగ్రహాలు
- రాడార్ భూ పరిశీలన కోసం మరో రెండు ఉపగ్రహాలు
- ప్రపంచంలోనే శక్తిమంతమైన ఘన ఇంధన రాకెట్‌గా గ్రావిటీ-1
- అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల పాత్రకు నిదర్శనం
- పునర్వినియోగ సాంకేతికతపై చైనా ప్రత్యేక దృష్టి




## ఏపీలో జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్ల స్టైఫండ్ పెంపు

- ఏపీలో జూనియర్ డాక్టర్లకు శుభవార్త చెప్పిన కూటమి ప్రభుత్వం
- ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్‌లకు 10 శాతం పెరుగుదల
- పీజీ విద్యార్థులకు 5శాతం,
- సూపర్ స్పెషాలిటీ వారికి 3 శాతం పెంపు
- ప్రభుత్వంపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు ఆర్థిక భారం

అమరావతి, ఏపీ బ్యూరో,

2026 జనవరి 1 నుంచే పెంపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి స్టైఫండ్‌ను పెంచుతూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన స్టైఫండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు

-మిగతా 2 లో

## ఆఫ్గనిస్తాన్‌పై పాకిస్తాన్ వైమానిక దాడులు

- కునార్, పక్తికా ప్రాంతాల్లో బాంబుల వర్షం
- కునార్‌లో ఓ ఇంటిపై దాడి.. ముగ్గురు మృతి
- పక్తికాలో ఇల్లు, దుకాణం ధ్వంసం
- ఉగ్రవాదులే లక్ష్యమన్న పాకిస్తాన్
- 28 మంది ఉగ్రవాదులు హతమైనట్లు పాక్ ప్రకటన
- దాడులను ఖండించిన తాలిబన్లు
- తగిన విధంగా స్పందిస్తామని హెచ్చరిక
- సరిహద్దు ఘర్షణలపై ఐక్యరాజ్యసమితి ఆందోళన
- ఏప్రిల్-జూన్‌లో 399 మంది పౌరులకు నష్టం



ఆఫ్గనిస్తాన్‌పై పాకిస్తాన్ దాడులు కొనసాగుతున్నాయి. ఆఫ్గనిస్తాన్‌పై సోమవారం పాకిస్తాన్ వైమానిక దాడులకు దిగింది. ఈ దాడుల్లో ముగ్గురు మరణించగా, మరికొందరు గాయపడ్డారు. ఆఫ్గనిస్తాన్‌లోని కునార్, పక్తిక ప్రాంతాలపై ఈ దాడులు జరిగాయి. ఇరు దేశాల మధ్య సరిహద్దులో కొనసాగుతున్న తీవ్రవాద కార్యకలాపాల నేపథ్యంలో పాక్ ఈ దాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. సోమవారం వేకువఝామున పాక్ వైమానిక దాడులకు దిగింది.పక్తిక ప్రావిన్స్‌లోని బర్మాల్ జిల్లా, రఖా, తోర్కండి ప్రాంతాలపై రెండు చోట్లా దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఇల్లు, ఒక షాపు ధ్వంసమైంది. కునార్ ప్రావిన్స్‌లో పాక్ జరిపిన దాడుల్లో ముగ్గురు సాధారణ పౌరులు మృతిచెందారు. అయితే, ఈ దాడిపై స్పష్టమైన వివరాలు తెలియలేవు. అయితే, సాధారణ పౌర నివాసాలపై దాడి చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి కాలంలో ఆఫ్గనిస్తాన్‌పై పాక్ జరుపుతున్న దాడుల్లో వందల మంది సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోతుండటంపై ఐక్యరాజ్యసమితి అసంతృప్తి వ్యక్తం చేసింది. గత ఏప్రిల్ నుంచి జూన్ వరకు సరిహద్దు వద్ద జరిగిన ఘర్షణల్లో దాదాపు 399 మంది గాయపడ్డారు. వీరిలో 57 మంది మరణించారు. 342 మంది గాయపడ్డారు. బాధితుల్లో మహిళలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఆఫ్గనిస్తాన్ కేంద్రంగా పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పాక్ ఆరోపిస్తోంది. పాకిస్తాన్ దాడులపై తాలిబన్లు కూడా ఘాటుగా స్పందించారు. తమ భూభాగాన్ని రక్షించుకునేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. తమ దేశంలో ఉగ్రవాదుల్ని చేర్చుకుంటున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఆఫ్గన్ ఖండించింది.

## ఇటలీ స్కూళ్లలో బుర్కా, నికాబ్‌పై నిషేధం


-విదేశీ విద్యార్థులకు కొత్త ప్రవేశ నిబంధనలు
-తల్లిదండ్రులు ఇటలీ భాష నేర్చుకోవడం తప్పనిసరి
-ఇటలీ సంస్కృతి, నిబంధనలను గౌరవించాల్సిందే
-స్కూళ్లు, కాలేజీల్లో విదేశీ విద్యార్థుల సంఖ్యకు పరిమితి
-ముఖం పూర్తిగా కప్పే బుర్కా, నికాబ్‌కే నిషేధం
-హిజాబ్‌పై ఎలాంటి ఆంక్షలు ప్రకటించని మెలోని
-పార్లమెంట్ ఆమోదం తర్వాత 60 రోజుల్లో అమలు
-వచ్చే ఏడాది ఎన్నికల వేళ మెలోని కీలక ప్రతిపాదనలు



ఇటలీ స్కూళ్లలో విద్యా విధనం విషయంపై ఆ దేశ ప్రధాని జార్జియా మెలోని కీలక నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా విదేశీ విద్యార్థులకు ప్రవేశం విషయంలో సంచలన ప్రతిపాదన చేశారు. దేశంలోని స్కూళ్లలో బుర్కా, నికాబ్ నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇటలీ రాజధాని రోమ్‌లో బ్రదర్స్ ఆఫ్ ఇటలీ పేరుతో జరిగిన పార్టీ కార్యక్రమంలో మెలోని దీనిపై ప్రకటన చేశారు. దీని ప్రకారం విదేశీ విద్యార్థులు ఇటలీ స్కూళ్లలో చదువుకోవాలంటే అక్కడి నిబంధనల్ని పాటించాల్సిందే.విదేశాల నుంచి వచ్చిన వారి పిల్లలు స్కూళ్లలో చదవాలంటే.. వారి తల్లిదండ్రులు ఇటలీ సంస్కృతి, భాషను అర్థం చేసుకోవాలి. ఇందుకోసం పేరెంట్స్ ఇటలీ లాంగ్వేజ్ క్లాసులకు హాజరు కావాలి. ఇదే సమయంలో స్కూళ్లలో విద్యార్థులు బుర్కా, నికాబ్ ధరించడాన్ని నిషేధించబోతున్నారు. ఈ ప్రతిపాదనలు పార్లమెంట్‌లో ఆమోదం పొంది, చట్టంగా మారేందుకు కనీసం 60 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ప్రపంచంలోని 24 ముస్లిమేతర దేశాల్లో ఇప్పటికే బుర్కా, నికాబ్‌లపై నిషేధం అమలవుతోంది. చైనా, ఫ్రాన్స్ దేశాలు ఈ నిబంధనను ఎప్పటినుంచో అమలు చేస్తున్నాయి. వచ్చే ఏడాది ఇటలీ పార్లమెంట్‌కు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా విద్యార్థులకు సంబంధించి మూడు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అవి.. ముఖం కనిపించకుండా చేసే బుర్కా, నికాబ్ వంటివాటిని స్కూళ్లలో నిషేధిస్తారు. ఇవి ఎక్కువగా ముస్లింలు ధరిస్తారు. అయితే, హిజాబ్‌పై మాత్రం ఎలాంటి నిషేధాన్ని ప్రకటించలేదు. అలాగే, విదేశాల నుంచి ఇటలీకి చదువుకోవడానికి వచ్చే విద్యార్థులు ఇటలీ సంస్కృతిని గౌరవించాలి. ఇటలీ భాష నేర్చుకోవాలి. ఇటలీలోని స్కూళ్లు, కాలేజీలలో విదేశీ విద్యార్థుల సంఖ్యకు పరిమితులు విధిస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇటలీ భాష నేర్చుకోవాలి. ఇక్కడి నిబంధనల్ని తప్పనిసరిగా పాటించాలి. వచ్చే ఏడాది ఎన్నికల్లో విజయం సాధించేందుకు.. ఇటలీ ప్రజల్ని ఆకట్టుకునేందుకు మెలోని ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారనే ప్రచారం ఉంది.

## రష్యాలో ఎదురులేని పుతిన్..

-పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయం
-పుతిన్‌కు చెందిన యునైటెడ్ రష్యా పార్టీకి భారీ విజయం
-డ్యూమాలో 455 స్థానాలకు ఎన్నికలు.. 355 సీట్లు కైవసం
- యునైటెడ్ రష్యాకు 57.83 శాతం ఓట్లు
-2021లో 49.8 శాతంగా ఉన్న ఓట్ల శాతం పెరుగుదల
-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత జరిగిన తొలి పార్లమెంట్ ఎన్నికలు
-కమ్యూనిస్ట్ పార్టీకి 40 సీట్లు.. 13.8 శాతం ఓట్లు
-ఎల్‌డీపీఆర్‌కు 25 సీట్లు.. 8.99 శాతం ఓట్లు
-న్యూ పీపుల్ పార్టీకి 20 సీట్లు.. 7.96 శాతం ఓట్లు
-మద్దతుగా నిలిచిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన ఎల్లా పాంఫిలోవా
-డ్యూమాలో మెజారిటీతో పుతిన్ పార్టీ ఆధిపత్యం కొనసాగింపు



ఢిల్లీ
రష్యాలో తనకు తిరుగులేదని అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మరోసారి నిరూపించుకున్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పుతిన్‌కు చెందిన యునైటెడ్ రష్యా పార్టీ ఘన విజయం సాధించింది. దీంతో పుతిన్ రష్యాలో మరోసారి తన పట్టు నిలుపుకొన్నారు. రష్యాలో గతవారం మూడు రోజులపాటు పార్లమెంటరీ ఎన్నికలు జరిగాయి. సోమవారం ఫలితాలు వెల్లడయ్యాయి.డ్యూమాగా పిలిచే రష్యా పార్లమెంట్‌లో 455 స్థానాలకు ఎన్నికలు జరగగా.. 355 స్థానాల్లో పుతిన్ పార్టీ విజయం సాధించింది. పుతిన్ పార్టీకి మొత్తం 57.83 శాతం ఓట్లు నమోదయ్యాయి. 2021లో జరిగిన ఎన్నికల్లో ఇది 49.8 శాతమే. డ్యూమా.. రష్యా ఫెడరల్ అసెంబ్లీకి చెందిన దిగువ సభ. ఈ సభలో మెజారిటీ ఉంటే ఏకంగా రష్యా రాజ్యాంగాన్నే మార్చే హక్కు ఉంటుంది. తాజా ఎన్నికలు పుతిన్‌కు చాలా కీలకం. ఎందుకంటే.. 2022లో ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యాలో జరిగిన తొలి ఎన్నికలివి. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా పుతిన్‌పై స్థానిక ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందనే ప్రచారం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు పుతిన్‌కు అనుకూలంగా తీర్పు ఇవ్వడం ఆసక్తికరం. దీంతో పుతిన్‌కు రష్యాలో ఇంకా ఆదరణ ఉందని, పెద్దగా వ్యతిరేకత లేదని స్పష్టమైంది. పుతిన్ పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా ఆ పార్టీ ఎన్నికల చీఫ్ ఎల్లా పాంఫిలోవా మాట్లాడారు. తమకు మద్దతుగా నిలిచిన ఓటర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల్లో రష్యా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ద రష్యన్ ఫెడరేషన్ (సీపీఆర్ఎఫ్) 40 సీట్లు, 13.8 శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. లిబరల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ రష్యా (ఎల్డీపీఆర్) 25 సీట్లు 8.99 శాతం ఓట్లతో మూడో స్థానం సాధించింది. తర్వాత ద న్యూ పీపుల్ పార్టీ (ఎన్‌పీపీ) 20 సీట్లు, 7.96 శాతం ఓట్లతో నాలుగో స్థానంలో నిలిచింది.

# స్వర్ణ కుప్పం దిశగా అడుగులు

కుప్పం,
నారావారిపల్లె తనకు జన్మనిస్తే.. కుప్పం తన రాజకీయ జీవితాన్ని ఇచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కుప్పాన్ని మోడల్ నియోజకవర్గంగా, స్వర్ణ కుప్పంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకువెళ్తున్నామని తెలిపారు. సోమవారం కుప్పంలో రూ.327 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు భూమిపూజ, శంకుస్థాపనలు చేశారు. నీరు, పరిశ్రమలు, ఉపాధి, సౌర విద్యుత్, మౌలిక వసతులకు ప్రాధాన్యమిస్తూ కుప్పం అభివృద్ధికి కొత్త ఊపు తీసుకొస్తామని చెప్పారు. హంద్రీనీవా కాలువ ద్వారా కుప్పానికి నీటిని తీసుకువచ్చి 133 చెరువులను నింపామని సీఎం తెలిపారు. నియోజకవర్గంలోని 550కిపైగా చిన్న నీటిపారుదల చెరువులను లిఫ్ట్ ఇరిగేషన్, పైప్‌లైన్లతో అనుసంధానం చేస్తున్నామన్నారు. బీరువానిపల్లి వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా రూ.45 కోట్లతో రిజర్వాయర్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. యామిగానిపల్లి, మనపర్తి ప్రాంతాల్లోనూ రిజర్వాయర్ల ఏర్పాటును పరిశీలిస్తున్నామని చెప్పారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. అధికంగా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి సిద్ధం, ప్రత్యామ్నాయ పంటలు, సూక్ష్మ సాగునీటి విధానాలపై దృష్టి పెట్టాలన్నారు. సేంద్రీయ ఎరువులు, బయోచార్ వినియోగంతో భూసారం, తేమను పెంచడంతో పాటు జీవవైవిధ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు.



చిరుధాన్యాలు, పశుపోషణ, పౌల్ట్రీ, ఉద్యాన పంటలతో రైతులకు, మహిళలకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు.

**ప్రతి ఇంటికీ సోలార్ రూఫ్‌టాప్**

కుప్పాన్ని నెట్‌జీరో నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు ప్రకటించారు. ప్రతి ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసి, ప్రతి ఇల్లూ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారేలా చర్యలు చేపడతామన్నారు. వ్యవసాయ ఫీడర్ల కోసం 15 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన పిఎం - కుసుమ్ సోలార్ ప్రాజెక్టులను ప్రారంభించారు. పీ4 కార్యక్రమం ద్వారా కుప్పంలోని 8,904 బంగారు కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని సీఎం తెలిపారు. కుప్పాన్ని పేదరికం లేని నియోజకవర్గంగా మార్చడమే లక్ష్యమన్నారు. టీసీఎస్, అదానీ, మెగా తదితర సంస్థలు 8,900కిపైగా కుటుంబాలను దత్తత తీసుకుని ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నాయని చెప్పారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త, ఒక స్టార్టప్ వ్యవస్థాపకుడు తయారవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

పరిశ్రమలు.. ఉపాధికి ప్రాధాన్యం

కుప్పంలో ఇప్పటికే 32 పరిశ్రమలు ఏర్పాటయ్యాయని, వాటి ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని సీఎం తెలిపారు. స్థానిక పరిశ్రమల్లో యువతకు ఉద్యోగాలు లభించేలా నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. బిర్లా ఇన్‌స్టిట్యూట్‌తో పాటు మానవ్ సర్వోదయ్ గ్లోబల్ యూనివర్సిటీ ద్వారా కూడా శిక్షణ అందిస్తామని వెల్లడించారు.

**రూ.289 కోట్ల ప్రాజెక్టులకు భూమిపూజ**

రెండు నెలల క్రితం కుప్పంలో రూ.7,939 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశామని సీఎం గుర్తుచేశారు. తాజాగా కుప్పం మున్సిపాలిటీ పరిధిలో రూ.38 కోట్ల ప్రభుత్వ పనులకు శంకుస్థాపన చేయగా, మరో రూ.289 కోట్ల విలువైన ప్రాజెక్టులకు భూమిపూజ నిర్వహించారు. రూ.3.30 కోట్లతో నిర్మించిన సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్, మెటీరియల్ రికవరీ సెంటర్‌ను ప్రారంభించారు. రూ.10 కోట్లతో నిర్మించనున్న ఆర్డీవో, ఏఆర్సీ కార్యాలయాలకు శంకుస్థాపన చేశారు. మల్లనూరు జూనియర్ కళాశాల, కుప్పం మార్కెట్ యార్డు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. హైమాస్ట్ దీపాలు, పబ్లిక్ టాయిలెట్లు, అండర్‌గ్రౌండ్ యుటిలిటీ వ్యవస్థ, బీటీ, సీసీ రోడ్ల అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక ఉత్పత్తుల విక్రయానికి ఆధునిక రైతుబజార్, హెరిటేజ్ గ్రానైట్ స్టోన్ క్లస్టర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.


## జూరాల నీటిపై కేటీఆర్ ఫైర్

(మొదటి తరువాయి)

ఆయన మీడియాతో మాట్లాడుతూ వరద జలాలపై కట్టిన ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం నీరు తీసుకెళ్తుంటే ఇక్కడ నికర జలాలపై నిర్మించిన ప్రాజెక్టుల కింద కూడా నీరు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ ఏడాది వచ్చిన 248 టీఎంసీల కృష్ణా జలాల్లో తెలంగాణ కేవలం 28 టీఎంసీలు మాత్రమే వాడిందని వివరించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డి పాలమూరు రైతులకు మొదటి శత్రువులా తయారయ్యారని అన్నారు. ఎల్‌నినో తరహాలో ఎల్ కాంగో వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. రైతుల కోసం వెళ్లిన బీఆర్ఎస్ నేతలను దుర్మార్గంగా పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టులతో భయటపెట్టలేరని అన్నారు. జూరాల కింద ఒక్క ఎకరం పంట ఎండినా కాంగ్రెస్ ప్రభుత్వానిదే బాధ్యత అని చెప్పారు. ప్రభుత్వ వైఖరి మార్చుకోకుంటే పెద్ద ఉద్యమానికి శ్రీకారం చుడతామనీ, ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాలు కాకుండా రైతుల ప్రయోజనాలు ముఖ్యం కావాలని సూచించారు. రైతుల విషయంలో రాజకీయం చేయొద్దని కోరారు. కన్నెపల్లి, నార్లాపూర్ పంపులను వెంటనే ఆన్ చేయాలని డిమాండ్ చేశారు. కర్నాటక ప్రభుత్వంతో మాట్లాడి పది టీఎంసీల నీరు తీసుకొచ్చి పంటలను కాపాడాలని చెప్పారు. తాము ఏమైనా తప్పులు చేసి ఉంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి చర్యలు అయినా తీసుకోవచ్చని అన్నారు. డ్రామాలు తగవనీ, భూముల వద్దకు వెళ్లి ఏం చేస్తారని ప్రశ్నించారు. ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమని సవాల్ చేస్తే ఇప్పటి వరకు కనీసం స్పందన లేదని అన్నారు. సిరిసిల్ల వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చెప్తారని ప్రశ్నించారు. నేతన్నల ఆత్మహత్యలు, రైతుబంధు ఎగ్గొట్టింది వివరిస్తారా?అని ఎద్దేవా చేశారు. సిరిసిల్లలో చేసిన అభివృద్ధిని చూసి కొడంగల్‌లో అమలు చేసేందుకు వస్తున్నారేమోనని అన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టు సిరిసిల్లలో ఎనిమిది వేల ఎకరాల భూమిని ఎవరు కబ్జా చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తప్పుడు ఆరోపణలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసిన రేవంత్ రెడ్డి రాజన్న దర్శనం చేసుకుని పాప ప్రక్షాళన చేసుకోవాలని సూచించారు.

## అంతరిక్ష రంగంలో చైనా దూకుడు..

ఢిల్లీ
అంతరిక్ష రంగం లో చైనా దూకుడు పెంచుతోంది. కేవలం 45 గంటల వ్యవధిలో నాలుగు రాకెట్ల (ఖీశీబతీ =శీఎనివేం) ను విజయవంతంగా ప్రయోగించింది. మూడు వేర్వేరు ప్రయోగ కేంద్రాల నుంచి ఈ ప్రయోగాలు జరిగాయి. సెప్టెంబర్ 15, 16 తేదీల్లో చేపట్టిన ఈ ప్రయోగాల్లో ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేటు కంపెనీల రాకెట్లు కూడా ఉన్నాయి. మొదటి ప్రయోగం సెప్టెంబర్ 15న జియుక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి జరిగింది. ల్యాండ్‌స్పేస్ సంస్థకు చెందిన జుక్యూ-2ఈ రాకెట్ 10 ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. క్వియాన్‌ఫాన్ బ్రాడ్‌బ్యాండ్ మెగా శాటిలైట్ నెట్‌వర్క్ కోసం వీటిని పంపారు. ఈ నెట్‌వర్క్‌లో భవిష్యత్తులో దాదాపు 15 వేల ఉపగ్రహాలను ప్రవేశపెట్టాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. అదేరోజు షాంఘై సముద్ర తీరంలోని మొబైల్ ప్లాట్‌ఫామ్ నుంచి ఒరియెన్‌స్పేస్ గ్రావిటీ-1 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఇది మరో తొమ్మిది క్వియాన్‌ఫాన్ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. ఘన ఇంధనంతో పనిచేసే ఈ రాకెట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సాలిడ్ ఫ్యూయల్ రాకెట్‌గా గుర్తింపు పొందింది. మూడో ప్రయోగం హైనాన్ దీవిలోని వెన్‌చాంగ్ కేంద్రం నుంచి జరిగింది. ప్రభుత్వ రంగానికి చెందిన లాంగ్ మార్చ్-12 రాకెట్ తొమ్మిది ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపింది. ఇవి సాట్‌నెట్ పేరుతో ఏర్పాటు చేస్తున్న మరో భారీ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ కోసం ఉద్దేశించినవి. ఇందులో దాదాపు 13 వేల ఉపగ్రహాలను ప్రవేశపెట్టే ప్రణాళిక ఉంది. నాలుగో ప్రయోగంతో ఈ వరుస ముగిసింది. జియుక్వాన్ నుంచి కుయ్‌జౌ-11 రాకెట్ రెండు రాడార్ భూ పరిశీలన ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. మొత్తంగా నాలుగు ప్రయోగాల్లో 30 ఉపగ్రహాలను చైనా కక్ష్యలోకి పంపింది. ఈ నాలుగు ప్రయోగాలు చైనా అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల పాత్ర పెరుగుతున్న విషయాన్ని కూడా చూపించాయి. అయితే ఈ నాలుగు ప్రయోగాల్లో ఏ రాకెట్ బూస్టర్‌ను తిరిగి భూమికి తీసుకురాలేదు. కాగా జుక్యూ-3, లాంగ్ మార్చ్-10 బీ రాకెట్ల తొలి దశలను విజయవంతంగా ల్యాండ్ చేసి పునర్వినియోగ సాంకేతికతలో చైనా ముందడుగు వేసింది.



## ఏపీలో జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్ల స్టైఫండ్ పెంపు

(మొదటి తరువాయి)

భారం పడనుంది.

స్టైఫండ్ పెంపునకు ఆమోదం..


వివరాల్లోకి వెళితే, తమ పనిభారానికి తగినట్లుగా స్టైఫండ్ పెంచాలని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ కొంత కాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని స్టైఫండ్ పెంపునకు ఆమోదం తెలిపింది.

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం...

ఎంబీబీఎస్, బీడీఎస్ హౌస్ సర్జన్లకు 10 శాతం స్టైఫండ్ పెంచారు. దీంతో వారి నెలవారీ స్టైఫండ్ రూ.28,497కి చేరింది. అదేవిధంగా, పీజీ డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేస్తున్న వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 3.5 శాతం చొప్పున స్టైఫండ్‌ను పెంచారు. ఈ పెంపు నిర్ణయం ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడిసిన్, సూపర్ స్పెషాలిటీ, ఎండీఎస్, డీఎన్‌బీ విద్యార్థులందరికీ వర్తిస్తుంది. జూనియర్ డాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

## ఢిల్లీలో దారుణం..

**ఆరో తరగతి బాలికను బంధించి అత్యాచారం చేసిన టైలర్**
**దుకాణంలోకి పిలిచి అఘాయిత్యానికి పాల్పడిన టైలర్**
**స్కూల్ వస్తువులు కొనేందుకు బయటకు వెళ్లిన బాలిక**
**ఒంటరిగా ఉండటాన్ని గమనించి మాయమాటలతో వల**
**ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులకు విషయం చెప్పిన బాలిక**
**పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు**
**నిందితుడు మక్సూద్‌ను అరెస్టు చేసిన పోలీసులు**
**పోక్సో చట్టం కింద కేసు నమోదు**
**వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలింపు**



ఢిల్లీ
దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన జరిగింది. ఆరో తరగతి చదివే బాలికను బంధించిన ఒక టైలర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఢిల్లీ, సదర్ బజార్‌లో ఈ నెల 16న రాత్రి 11.00 గంటలకు జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి. ఈ ప్రాంతంలో కుటుంబంతో కలిసి ఉంటున్న ఒక బాలిక ఆరో తరగతి చదువుతోంది.సెప్టెంబర్ 16న రాత్రి 11.00 గంటలకు స్కూల్‌కు అవసరమైన కొన్ని వస్తువులు కొనేందుకు ఆ బాలిక బయటకు వెళ్లింది. బాలిక వెళ్లే దారిలో ఒక టైలరింగ్ షాపు ఉంది. బాలిక ఒంటరిగా ఉండటం గమనించి ఆ షాపు ఓనర్ కం టైలర్ అయిన మక్సూద్.. బాలికకు మాయమాటలు చెప్పాడు. తన షాపులోకి రమ్మన్నాడు. షాపులోకి వచ్చిన బాలికపై మక్సూద్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక షాపు నుంచి ఇంటికి వచ్చిన బాలిక కుటుంబ సభ్యులకు విషయం చెప్పింది. దీంతో వారు సదర్ బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎఫ్ఐ నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు మక్సూద్‌ను అరెస్టు చేశారు. అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఈ ఘటనపై విచారణ జరుగుతోందని, నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని పోలీసులు తెలిపారు.

## అల్పపీడనంపై అప్రమత్తం

(మొదటి తరువాయి)



భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఒడిశాలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వంశధార, నాగావళి నదుల ప్రవాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఒడిశా సరిహద్దు జిల్లాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని సూచించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను 24 గంటలూ అందుబాటులో ఉంచి, క్షేత్రస్థాయి అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిత్యవసరాలు, వైద్యం, ఇతర అత్యవసర సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. తీరప్రాంత, లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని బట్టి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పొంగిపొర్లే వాగులు, ప్రమాదకర కాజ్‌వేలు, ముంపు ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల ప్రజలు, వాహనాల రాకపోకలను నియంత్రించి ప్రాణనష్టం జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

తీవ్ర వాయుగుండం ప్రభావంతో తీర ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని సూచించారు. చెట్లు, భారీ హోర్డింగులు, పాతబడిన లేదా శిథిలావస్థలో ఉన్న ఇళ్లకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వం జారీ చేసే అధికారిక సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హోంమంత్రి అనిత విజ్ఞప్తి చేశారు.

# టీడీపీ పార్లమెంట్ కార్యాలయ నిర్మాణ పనుల పరిశీలించిన మంత్రి





**ఒంగోలు, ప్రకాశం సెప్టెంబర్ 21 (నేటి దర్శిని**

ఒంగోలులో నిర్మాణంలో ఉన్న తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ పార్టీ కార్యాలయ నిర్మాణ పనులను సోమవారం నాడు రాష్ట్ర మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించిన మంత్రి, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, పనుల వివరాలను సంబంధిత ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ నిర్మాణంలో చేపడుతున్న వివిధ పనులు, మౌలిక వసతుల ఏర్పాట్లు, కార్యాలయ వినియోగానికి అనుగుణంగా చేపడుతున్న నిర్మాణ ప్రణాళిక తదితర అంశాలపై చర్చించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్ణీత ప్రణాళిక ప్రకారం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... కార్యకర్తలకు అందుబాటులో ఉండే విధంగా పార్టీ కార్యాలయాన్ని తీర్చిదిద్దడంతో పాటు, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత సమన్వయంతో నిర్వహించేందుకు అవసరమైన వసతులు కల్పించడంపై దృష్టి సారించామన్నారు.

పార్టీ అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలకు కార్యాలయం ఒక సమన్వయ వేదికగా నిలుస్తుందని, ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత వర్గాలతో సమన్వయం చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి మరింత ముందుగానే కార్యాలయాన్ని అందుబాటు లోకి తీసుకొస్తామన్నారు.

# 71.48 ఎకరాల గ్రామకంఠం భూమికి విముక్తి.

**-సుదీర్ఘ కాల సమస్యకు మంత్రి గొట్టిపాటి చొరవతో జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు.**

**అద్దంకి, ప్రకాశం సెప్టెంబర్ 21 (నేటి దర్శిని**

ఉత్తర అద్దంకికి చెందిన 71.48 ఎకరాల భూమిని దేవదాయ శాఖ రికార్డుల నుంచి తొలగించి గ్రామ కంఠంగా గుర్తిస్తూ జిల్లా కలెక్టర్ రాజాబాబు ఉత్తర్వులు ఇవ్వడంతో విముక్తి లభించి నట్లయింది. 2016కు పూర్వం ఈ భూమిలో క్రయవిక్రయాలు జరిగాయి. అనంతరం చోటు చేసుకున్న పరిణామాల వలన ఉత్తర అద్దంకి పరిధి లోని సర్వే నంబరు 1038 లోని 71.48 ఎకరాల గ్రామ కంఠం భూమిని పక్కనే గల ఇదే సర్వే నంబరు లోని 1.76 దేవాదాయశాఖ భూమిలో కలిపేశారు. దీంతో మొత్తం 73.24 ఎకరాల భూమి దేవాదాయశాఖకు చెందినట్లుగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేశారు. అందువలన ఈ భూమి లోని నివాసగృహాలు,ఖాళీ స్థలాలకు ఎలాంటి క్రయ విక్రయాలు జరగలేదు. విలువైన భూముల్లో ఎత్తయిన అంతస్తుల్లో భవనాలు నిర్మించుకున్నప్పటికీ రిజిస్ట్రేషన్లకు నోచుకోలేదు. కాకానిపాలెం, దూదేకులపాలెం, కట్టకిందపాలెం, ఇస్లాంపేట, ముజావారిపాలెం, పెరికపాలెం,బత్తులవారిపాలెం ఏరియాలో సుమారు 2500కు పైగా నివాసగృహాలవారు పదేళ్ల పాటు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లడంతో స్పందించారు. అన్ని రకాల ఆధారాలు సమర్పించడంతో అద్దంకి ఆర్డీవో, తహసీల్దార్ సిఫారసు మేరకు 71.48 ఏకరాల గ్రామకంఠం భూమికి మోక్షం లభించినట్లయింది. సోమవారం రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఈ భూముల్లో క్రయవిక్రయాలు ప్రారంభమైనాయి.మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవ, కృషితోనే ఇది సాధ్యమైంది.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొనే బహిరంగ సభా ప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పంతం నానాజీ

**పిఠాపురం, సెప్టెంబర్ 21 (నేటి దర్శిని):**





ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు, పిఠాపురం శాసనసభ్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ మంగళవారం పిఠాపురం గ్రౌండ్స్‌లో పాల్గొననున్న భారీ బహిరంగ సభా ప్రాంగణాన్ని కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ పరిశీలించారు. ఈ సందర్భంగా సభకు హాజరయ్యే జనసైనికులు, పార్టీ శ్రేణులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చేపడుతున్న బందోబస్తు, భద్రతా చర్యలు, పార్కింగ్, తాగునీరు, ఇతర మౌలిక వసతుల ఏర్పాట్లను ఎమ్మెల్యే సమీక్షించారు. సభ విజయవంతంగా, ప్రశాంతంగా జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, సంబంధిత ప్రభుత్వ అధికారులు, ఎమ్మెల్యే తనయుడు పంతం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# పీఠికాపుర వనం ఆవిష్కరణ చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**కాకినాడ, సెప్టెంబర్ 21 (నేటి దర్శిని):**

పిఠాపురం పట్టణ, నియోజకవర్గ ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంతోపాటు పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో అభివృద్ధి చేసిన 'పీఠికాపుర వనం' నగరవనాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ--పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం ప్రారంభించారు. నగరవనంలో మొక్క నాటి, ప్రారంభ సూచకంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ నగర్ వన్ యోజన పథకం కింద సుమారు రూ. 1.83 కోట్ల వ్యయంతో ఆరు ఎకరాల విస్తీర్ణంలో ఈ నగరవనాన్ని అభివృద్ధి చేశారు. గతంలో డంపింగ్ యార్డుగా, అపరిశుభ్రతకు నిలయంగా ఉన్న ప్రాంతాన్ని హరితవనంగా తీర్చిదిద్దడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పిఠాపురానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఆహ్లాదం, ఆధ్యాత్మికతల సమ్మేళనంగా నగరవనాన్ని రూపొందించారు.

**నక్షత్రవనం.. శివపంచాయతన వనం ప్రత్యేక ఆకర్షణ**

నగరవనంలో ఏర్పాటు చేసిన నక్షత్రవనం, శివపంచాయతన వనం సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఉసిరి, మేడి, మోదుగ, కొండమామిడి, పిప్పలి, వెదురు, రావి, మర్రి, జాతి జువ్వి, దేవదారు, జిల్లేడు, జమ్మి, విప్ప, వేప తదితర మొక్కలను క్రమబద్ధంగా నాటారు. ప్రతి మొక్కకు శాస్త్రీయ నామంతో పాటు స్థానికంగా ఉపయోగించే పేర్లతో బోర్డులను ఏర్పాటు చేశారు. శివస్వరూపమైన మారేడు మొక్కతో పాటు వినాయకుడు, విష్ణువు, అమ్మవారు, సూర్యభగవానుడి స్వరూపాలకు ప్రతీకలుగా భావించే మొక్కలను





శివపంచాయతనంగా ఏర్పాటు చేశారు. కార్తీక మాసంతో పాటు ప్రత్యేక రోజుల్లో ఆయా మొక్కలకు ప్రదక్షిణ చేసే విధంగా వనం రూపకల్పన చేశారు.

**మియావకీ ఫారెస్ట్.. బటర్‌ఫ్లై పార్క్**

అనంతరం 70 సెంట్ల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన మియావకీ ఫారెస్ట్ ప్లాంటేషన్, బటర్‌ఫ్లై పార్క్, నగరవనం మధ్యలో ఏర్పాటు చేసిన భారీ కొలనును పవన్ కళ్యాణ్ పరిశీలించారు. తక్కువ విస్తీర్ణంలో అధిక సంఖ్యలో మొక్కలను పెంచుతూ వేగంగా పచ్చదనాన్ని అభివృద్ధి చేసే విధంగా మియావకీ పద్ధతిలో చిట్టడవిని ఏర్పాటు చేశారు. నగరవనంలో బాక్స్ క్రికెట్, ప్లే కోర్ట్స్ తదితర మరిన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పిఠాపురం ప్రజలతో పాటు ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి ఆధ్యాత్మిక సందర్శనకు వచ్చే భక్తులకు ఆహ్లాదాన్ని అందించేలా నగరవనాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు.



**అధికారులకు అభినందనలు**

గతంలో డంపింగ్ యార్డుగా ఉన్న ప్రాంతం ప్రస్తుత నగరవనంగా ఎలా రూపాంతరం చెందిందో తెలియజేసేలా ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని పవన్ కళ్యాణ్ తిలకించారు. పీఠికాపుర వనం అభివృద్ధికి కృషి చేసిన అధికారులను ఆయన అభినందించారు. కేంద్ర ప్రభుత్వ నగర్ వన్ యోజన పథకం సహకారంతో రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో నగరవనాలను అభివృద్ధి చేస్తున్నామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 36 కోట్లతో 18 నగరవనాలను అభివృద్ధి చేసి ఇటీవల ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, కౌడా ఛైర్మన్ తలాటం సత్య, రాష్ట్ర అటవీ శాఖ ఐటీ సలహాదారు పెన్నమరెడ్డి నాగబాబు, పడా పీడీ శివరాం ప్రసాద్, సీసీఎఫ్ జ్యోతి, కాకినాడ డీఎఫ్ఓ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఫ్లై ఓవర్ మెట్లు

**-పాదచారులకు తీవ్ర ఇబ్బందులు..**

**కాకినాడ, సెప్టెంబర్ 21 (నేటి దర్శిని**

: కాకినాడ నగరంలోని కల్పనా కూడలి నుంచి వెళ్లే ఫ్లైఓవర్ వంతెనకు అనుబంధంగా ఉన్న మెట్లు అపరిశుభ్రతకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం వందలాది మంది పాదచారులు వినియోగించే ఈ మార్గంలో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్పనా కూడలి నుంచి కాకినాడ పోర్టు రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు, అలాగే ప్రభుత్వ ఈఎస్ఐ ఆసుపత్రికి చేరుకునేందుకు ఈ ఫ్లైఓవర్ మార్గాన్ని ప్రజలు వినియోగిస్తున్నారు. వంతెనపై కొంత దూరం ప్రయాణించిన అనంతరం మెట్ల ద్వారా దిగితే తమ గమ్యస్థానాలకు త్వరగా చేరుకునే అవకాశం ఉండటంతో పాదచారులు ఈ మార్గాన్నే ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. అయితే మెట్ల పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో చెత్తాచెదారం, దుర్వాసనతో పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. అక్కడక్కడా బీరు సీసాలు, ఉపయోగించిన కండోమ్‌లు కనిపిస్తున్నాయని, దీంతో ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు కూడా అడ్డాగా మారుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణం కారణంగా మెట్లపై నుంచి







రాకపోకలు సాగించే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, ఆసుపత్రులకు వెళ్లే రోగులు మరియు వారి సహాయకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొంటున్నారు. పరిస్థితి భరించలేని కొందరు పాదచారులు అదనపు దూరం అయినప్పటికీ చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు.

**తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి**

ప్రజలకు ఉపయోగకరంగా ఉన్న ఈ మార్గాన్ని అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఫ్లైఓవర్ మెట్లను సందర్శించి అక్కడ పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో పాటు, రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మెట్ల ప్రాంతాన్ని క్రమం తప్పకుండా శుభ్రపరిచేలా చర్యలు తీసుకుని పాదచారులకు సురక్షితమైన, పరిశుభ్రమైన మార్గంగా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

# పీజీఆర్ఎస్ అర్జీలను వేగంగా పరిష్కరించాలి..నిర్లక్ష్యం వీడాలి

**-జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశం**

**-క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా అర్జీదారులకు పూర్తి న్యాయం జరగాలి.**

**-గ్రీవెన్స్ కార్యక్రమంలో 257 అర్జీల స్వీకరణ.**

**మార్కాపురం,జిల్లా సెప్టెంబర్ 21 (నేటి దర్శిని**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు ప్రత్యేక చొరవతో, అత్యంత వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.సోమవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాల్లో క్షేత్రస్థాయిలో పరిష్కరించదగిన సమస్యలను



అధికారులు నేరుగా పరిశీలించి, అర్జీదారుల సమక్షంలోనే పారదర్శకంగా పరిష్కరించాలని పేర్కొన్నారు.ఒకే సమస్యపై ప్రజలు పదేపదే కలెక్టరేట్ చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదని, రీ-ఓపెన్ అర్జీలు రాకుండా చూడాల్సిన పూర్తి బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉందని స్పష్టం చేశారు. సమస్యలను సరిచూసుకొని వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. స్వీకరించిన అర్జీల్లో సింహభాగం రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉన్నందున, రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా స్పందించి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. ప్రజల సంతృప్తే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై మొత్తం 257 అర్జీలు నమోదయ్యాయి. వీటిలో రెవెన్యూ సంబంధిత అర్జీలు: 182 కాగా..ఇతర శాఖల సంబంధిత అర్జీలు..75..ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, డిఆర్ఓ వెంకటశివరామి రెడ్డి, వివిధ శాఖల జిల్లా స్థాయి

# కృతి శెట్టికి పుట్టినరోజు కానుక..

## జనవరి 12 విడుదల'లో దీపుగా బేబమ్మ




కృతి శెట్టి పుట్టినరోజు సందర్భంగా 'జనవరి 12 విడుదల' చిత్రబృందం ఆమెకు ప్రత్యేక సర్‌ప్రైజ్ ఇచ్చింది. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సంక్రాంతి వినోదాత్మక చిత్రంలో కృతి శెట్టిని 'దీపు'గా పరిచయం చేస్తూ ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కృతి శెట్టి సంప్రదాయ హాఫ్ శారీలో కనిపించారు. ఊదా, గులాబీ రంగులతో కూడిన దుస్తుల్లో ఆమె ఎంతో అందంగా దర్శనమిచ్చారు. చారిత్రక కట్టడం బ్యాక్ గ్రౌండ్‌లో కనిపిస్తుండగా.. చిరునవ్వుతో కృతి శెట్టి ఇచ్చిన పోజ్ పోస్టర్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చింది. ఈ పోస్టర్ ద్వారా ఆమె పోషిస్తున్న పాత్ర చాలా సంప్రదాయబద్ధంగా ఉంటుందని క్లారిటీ వచ్చింది.'జనవరి 12 విడుదల' చిత్రానికి అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. విభిన్నమైన టైటిల్‌తో ఇప్పటికే ఈ సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. 'బావ బామ్మర్ది సౌజన్యంతో' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్ కూడా సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇటీవల వెంకటేష్, కళ్యాణ్ రామ్‌లతో రూపొందించిన హాస్యభరితమైన వీడియో ద్వారా సినిమా టైటిల్‌ను ప్రకటించారు.ఈ చిత్రంలో కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. వీరితో పాటు పలువురు ప్రముఖ నటీనటులు కూడా సినిమాలో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి ఛాయాగ్రహణం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తమ్మిరాజు ఎడిటింగ్, ఏఎస్ ప్రకాశ్ ప్రొడక్షన్ డిజైన్‌ను చూసుకుంటున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ చిత్రాన్ని జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.



# ఆశికా రంగనాథ్ గ్లామర్ షో..

# హీరోయిన్ నుంచి విలన్‌గా..


## ఆ పాత్రకైనా రెడీ అంటున్న భాగ్యశ్రీ



పాత్ర ఎలాంటిది అన్నది ముఖ్యం కాదు.. నటనకు అవకాశం ఉంటే ఏ తరహా పాత్రనైనా పోషించడానికి సిద్ధం. అవసరమైతే విలన్‌గా కూడా నటిస్తా' అంటున్నది మరాఠీ భామ భాగ్యశ్రీబోర్సే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను భాగ్యశ్రీ వెల్లడించింది. 'అసలు నటిని కావాలనే ఆలోచనే నాకు లేదు. బిజినెస్ మేనేజ్‌మెంట్ చదువుకున్న నేను.. అనుకోకుండా మోడలింగ్‌లో అడుగుపెట్టా. అక్కడ మంచి పేరొచ్చింది.సినిమాల్లోకి వెళితే ఇంకా ఫేమ్ వస్తుందని ఫ్రెండ్స్ చెప్పడంతో ప్రయత్నం చేశా. అనుకోకుండా అవకాశాలు వచ్చాయి. అయితే.. ప్రారంభంలోనే ఒడిదుడుకులు ఎదుర్కొన్నా. పెద్దగా ఆడకపోయినా 'కాంత' సినిమా నటిగా నాకు సంతృప్తినిచ్చింది. అందులోని నా నటనను 'మహానటి'లో కీర్తి సురేశ్ నటనతో చాలా మంది పోల్చారు. అది నాకు ఆనందాన్నిచ్చే విషయం. ఇక సక్సెస్ రుచిని చూపించిన సినిమా 'లెనిన్'. ప్రస్తుతం శివకార్తికేయన్‌తో చేస్తున్న 'సెయోన్'లో కూడా నటనకు ఆస్కారమున్న పాత్రే చేస్తున్నా' అంటూ చెప్పుకొచ్చింది భాగ్యశ్రీ బోర్సే.

# ది పారడైజ్'కు సెన్సార్ షాక్..

## 21 కట్స్‌తో 'ఏ' సర్టిఫికెట్, ఫైనల్ రన్‌టైమ్ ఇదే



నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన అత్యంత ఆసక్తికరమైన చిత్రం 'ది పారడైజ్'. 'దసరా' తర్వాత ఈ ఇద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రా అండ్ రస్టిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న వేళ సెన్సార్ ప్రక్రియకు సంబంధించిన తాజా సమాచారం ఆసక్తిని రేకెత్తిస్తోంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. అంతేకాకుండా సినిమాలోని పలు సన్నివేశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ మొత్తం 21 మార్పులు, కట్స్ సూచించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సినిమాలోని కొన్ని హింసాత్మక సన్నివేశాలు, తీవ్ర అభ్యంతరకరమైన పదజాలం, హీరో పాత్ర చేతిపై కనిపించే వివాదాస్పద టాటూపై సెన్సార్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం.సెన్సార్ సూచనల మేరకు చిత్రబృందం కొన్ని హింసాత్మక సన్నివేశాలను కుదించడంతో పాటు, కొన్ని సంభాషణలను మ్యూట్ చేసినట్లు తెలుస్తోంది. అలాగే అవసరమైన హెచ్చరికలను కూడా సినిమాలో చేర్చినట్లు సమాచారం. ఈ మార్పుల అనంతరం 'ది పారడైజ్' తుది నిడివి 174 నిమిషాలుగా, అంటే 2 గంటల 54 నిమిషాలుగా ఖరారైంది. తొలుత ఈ సినిమా నిడివి 2 గంటల 49 నిమిషాలుగా ఉండేలా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రణాళిక రూపొందించారు. అయితే సెన్సార్ సూచించిన మార్పుల కారణంగా తుది నిడివిలో స్వల్ప మార్పు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.ఇక సెన్సార్ బోర్డు 21 కట్స్ సూచించినట్లు వస్తున్న వార్తలపై నాని అభిమానుల్లో చర్చ మొదలైంది. 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కలిసి చేస్తున్న చిత్రం కావడంతో 'ది పారడైజ్'పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా రా యాక్షన్, బలమైన కథాంశం, నాని పాత్ర ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయని చిత్రబృందం ఇప్పటికే చెప్పుకొచ్చింది. అణచివేతకు గురైన ఓ సమాజం తమ హక్కుల కోసం తిరుగుబాటు చేసే నేపథ్యంలో ఈ పీరియాడిక్ మాస్ డ్రామాను రూపొందించినట్లు సమాచారం. ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. మరోవైపు ఎలాంటి అధికారిక ట్రైలర్ విడుదల చేయకుండానే టీజర్, పాటలతో సినిమాపై భారీ ఆసక్తిని పెంచడం 'ది పారడైజ్'కు ప్రత్యేక ఆకర్షణగా మారింది. నాని కెరీర్‌లోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. తెలుగు, హిందీ, తమిళం సహా పలు భాషల్లో ఈ సినిమాను భారీ స్థాయిలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు



# ఫోన్లు పక్కనపెట్టి మాట్లాడుకోండి..

## - బంధాలపై కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు

నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్ల ప్రభావం మనుషుల మధ్య బంధాలపై కూడా పడుతోందని నటి కాజల్ అగర్వాల్ అభిప్రాయపడింది. ముఖ్యంగా భార్యాభర్తలు ఒకరితో ఒకరు మాట్లాడుకునేందుకు కూడా తగినంత సమయం కేటాయించకపోవడం ఆందోళన కలిగించే విషయమని ఆమె పేర్కొంది. కలిసి బయటకు వెళ్లిన సమయంలోనూ ఫోన్లలో మునిగిపోవడం వల్ల బంధాల్లో కమ్యూనికేషన్ తగ్గిపోతోందని చెప్పింది. కాజల్ అగర్వాల్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను కూడా ఈ సందర్భంగా పంచుకుంది. తన భర్త గౌతమ్ కిచ్లూతో కలిసి ప్రతి వారం కనీసం ఒకరోజు డిన్నర్‌కు బయటకు వెళ్తామని ఆమె తెలిపింది. ఆ సమయంలో ఇద్దరం ఫోన్లను పక్కన పెట్టి కేవలం ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి, కలిసి సమయం గడపడానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పింది.ప్రస్తుతం చాలా మంది జంటలు కలిసి ఉన్నప్పటికీ ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి సమయం కేటాయించడం లేదని కాజల్ పేర్కొంది. డిన్నర్ డేట్‌కు వెళ్లినా చేతిలో ఫోన్ పట్టుకుని సోషల్ మీడియా చూస్తూ ఉండటం వల్ల పక్కనే ఉన్న వ్యక్తితోనే దూరం పెరుగుతోందని ఆమె అభిప్రాయపడింది. భార్యాభర్తల మధ్య మంచి అనుబంధం కొనసాగాలంటే ఒకరి అభిప్రాయాలను మరొకరు వినడం, మాట్లాడుకోవడం చాలా ముఖ్యమని కాజల్ సూచించింది. ఎంత బిజీగా ఉన్నప్పటికీ భాగస్వామితో కొంత సమయం గడపడం, తమ ఆలోచనలు, అనుభవాలను పంచుకోవడం అవసరమని చెప్పింది. తన వివాహ బంధంలో తాము పాటిస్తున్న ఈ విధానం గురించి చెబుతూ.. వారానికి ఒకరోజు ఫోన్‌లకు దూరంగా కలిసి సమయం గడపడం తమకు ఉపయోగపడుతోందని కాజల్ వెల్లడించింది. డిజిటల్ ప్రపంచంలో నిరంతరం గడపడం కంటే నిజ జీవితంలో మన చుట్టూ ఉన్న వ్యక్తులతో మాట్లాడటం, వారి మాటలు వినడం ముఖ్యమనే సందేశాన్ని ఆమె ఇచ్చింది. కాజల్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలతో పాటు సాధారణ కుటుంబాల్లోనూ స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం పెరిగిన నేపథ్యంలో ఆమె చెప్పిన మాటలు ఆసక్తిని కలిగిస్తున్నాయి.ఇదిలా ఉంటే.. కాజల్ అగర్వాల్ ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఉంది. ఆమె నటించిన 'ది ఇండియా స్టోరీ' చిత్రం ఇటీవల ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. ఈ సినిమాలో కాజల్ న్యాయవాది పాత్రలో కనిపించింది. ఆహార కల్తీ, వ్యవసాయంలో పురుగుమందుల వినియోగం వంటి అంశాల చుట్టూ ఈ సినిమా కథ కొనసాగుతుంది.

Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450